

సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024

● గోల్డెన్ గణేష్



● సపరివారంగా..



● సైనిక్ నాయక్



● ఉత్తిష్ట గణపతి..



కొలువుదీరిన గణనాథుడు

● ఆకట్టుకుంటున్న అలంకరణలు

హన్మకొండ కల్చరల్/హన్మకొండ చౌరస్తా: నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం వినాయక చవితి రోజు వేడుకలు మొదలయ్యాయి. ఆలయాలు, ఇళ్లు, ముఖ్య కూడళ్లలో గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో ఉత్తిష్ట గణపతి ఉత్సవాలను ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ ఈఓ కె.వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక వినాయకుడు..

హనుమకొండ సుధానగర్‌లో శ్రీనూతన గజానన మండలి బాధ్యులు సైనికుడి వేషధారణలో ఉన్న గణపతి ప్రతిమను ప్రతిష్ఠించారు. ఓ చేతిలో జాతీయ పతాకం, మరో చేతిలో ఏకే-47తో వినాయకుడు భక్తులను ఆకట్టుకుంటున్నాడు. హనుమకొండ సీపీ రెడ్డి కాంప్లెక్స్ వెనకాల మేరుగజానన మండలి ఆధ్వర్యాన సపరివార, వరంగల్ పిన్నావారి వీధిలో గోల్డ్ కలర్ గణపతులను ప్రతిష్ఠించారు.

న్యూస్‌రీల్

బయో-3తో నూతన ఆవిష్కరణలు



కాజీపేట అర్బన్: బయో-3(బయోటెక్నాలజీ ఫర్ ఎన్విరాన్‌మెంటల్, ఎకనామిక్ అండ్ ఎథికల్ ఎంపవర్‌మెంట్) నూతన ఆవిష్కరణలు, ప్రయోగాలకు తోడ్పడుతాయని కేంద్ర బయోటెక్నాలజీ సైంటిస్టుల బృందం పేర్కొంది. నిట్ వరంగల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోసిస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీని కేంద్ర బయోటెక్నాలజీ సైంటిస్టుల బృందం శుక్ర, శనివారాల్లో సందర్శించింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీతో ఏర్పాటు చేసిన సమావేశంలో బయోటెక్నాలజీ సైంటిస్టులు మాట్లాడారు. సైంటిస్టులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రమేశ్, నిట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి పరీక్ష వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 9న జరగాల్సిన బీఫార్మసీ రెండో సెమిస్టర్‌కు సంబంధించిన ఒక పేపర్ పరీక్షను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. మిగిలిన పరీక్షలు టైంటేబుల్ ప్రకారం జరుగుతాయన్నారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేసిన ఈ పరీక్ష నిర్వహించే తేదీ తర్వాత వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

10న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 10న వరంగల్ జిల్లాస్థాయి అండర్-8,10,12,14,16, 18,20 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షైన్ కుమార్‌యాదవ్, ఊర యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో జరిగే సౌత్‌జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికకు క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు 98665 64422, 96188 28299 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు మెగా అప్రెంటిస్ మేళా

కాజీపేట: కాజీపేట పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో సోమవారం ఉదయం 10 గంటలకు జాతీయ మెగా అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు www. apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని అప్రెంటిస్ మేళాకు హాజరుకావాలని కోరారు. బయోడేటా, అప్రెంటిస్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ మెమో, ఐటీఐ మెమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రంతోపాటు రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు రావాలన్నారు.


11న ఒడిబాల బియ్యం వేలం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన 30 క్వింటాళ్ల ఒడిబాల బియ్యాన్ని ఈ నెల 11న వేలం వేయనున్నట్లు ఈఓ శేషుభారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 5 వేల రూపాయలు డీడీ చెల్లించాలని, వివరాలకు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ)లో గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సమస్యలపై రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉప్పల్ రైల్వేగేట్ మూసివేత



కమలాపూర్: ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న 14టీ నంబర్ రైల్వేగేట్‌ను ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు మూసివేయనున్నట్లు కాజీపేట రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం రైల్వేగేట్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని కోరారు. రైల్వే గేట్ మూసివేయడంతో హుజూరాబాద్ నుంచి పరకాలకు, పరకాల నుంచి హుజూరాబాద్‌కు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులను ఉప్పల్ రైల్వేగేట్ వరకే నడిపిస్తున్నారు. దీంతో ప్రయాణికులు కాలినడకన రైల్వే గేట్ దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఫిజియోథెరపిస్టుల నియామకం అవసరం

● వరంగల్ ఎంపీ కడియం కావ్య

హన్మకొండ: ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టుల నియామకం అవసరం.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వరంగల్ జిల్లా ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యాన నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫిజియోథెరపిస్టుల సమస్యలపై లోక్‌సభలో మాట్లాడి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని



ఎంపీ కావ్యతో ఫిజియోథెరపిస్టులు

చెప్పారు. ఫిజియోథెరపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, అసోసియేషన్ బాధ్యులు వంశీ, డాక్టర్ రాము, డాక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కళా రాజసం..

జిగేల్ మంటున్న కాళోజీ కళాక్షేత్రం

- నాలుగు అంతస్తుల్లో ఆధునిక హంగులు
- రూ.90 కోట్ల వ్యయం.. 4.25 ఎకరాల విస్తీర్ణం
- 'కుడా' మైదానంలో నిర్మాణం
- నేడు ప్రజాకవి కాళోజీ జయంతి



హన్మకొండ కల్చరల్: కాకతీయుల కళారాజ్యంలో ఆధునిక హంగులతో ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో కళాక్షేత్రం సిద్ధమైంది. హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డున ఉన్న హయగ్రీవాచారి మైదానంలో సుమారు రూ.90 కోట్లతో ప్రభుత్వం నిర్మించింది. 2014లో ఆనాటి సీఎం కేసీఆర్ కాళోజీ కళాక్షేత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పదేళ్లుగా పనులు నత్తనడకన సాగినా అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదనే విమర్శలు లేకపోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాక్షేత్రం నిర్మాణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మాణం పూర్తిచేసేందుకు మరో రూ.40 కోట్ల నిధులు కేటాయించారు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీవాకడే, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో అధికారులు పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఈ కళాక్షేత్రం భవనాన్ని ఈనెల 9న ప్రజాకవి కాళోజీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అయితే అనివార్య కారణాలతో సీఎం పర్యటన రద్దయినట్లు సమాచారం.

కాళోజీ కాంస్య విగ్రహం ఏర్పాటు..

కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించారు. ఆయన తల్లి రామాబాయమ్మ కర్ణాటక,తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రకు చెందినవారు.కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ,ఇంగ్లిష్ భాషల రచయితగా ప్రఖ్యాతిగాంచారు. వరంగల్‌కు చేరిన కాళోజీ నిజాం దమననీతి, నిరంకుశత్వం, అరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలం ఎత్తారు.

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడైన కాళోజీ 1992లో భారతదేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ పొందారు. ఆయన జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి గౌరవించింది. కళాక్షేత్రం భవనం ఎదుట 10 అడుగుల కాళోజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశా రు. కళాక్షేత్రానికి ముందు ఉద్యానవనం, తామరపూల ఆకారంలో వాటర్ ఫౌంటేన్లు,గార్డెన్‌తో తీర్చి దిద్దారు. హనుమకొండ బస్‌స్టేషన్ మెయిన్ రోడ్ వైపు ఎంట్రీ, ఎగ్జిట్‌తో 2 మెయిన్ గేట్లు ఏర్పాటు చేశారు. ఎడమ వైపు శ్రీనివాస్‌నగర్ సైడ్ మరో ఎమర్జెన్సీ గేటు ఉంది. 100 కార్లు పట్టేలా విశాలమైన వాహన పార్కింగ్ సౌకర్యం కల్పించారు. 800 ఏళ్ల నాటి కాకతీయుల నిర్మాణ శైలి ఉట్టిపడేలా.. చారిత్రక, సాంస్కృతిక గుర్తింపును ఇనుమడింపజేసేలా ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించింది.

రవీంద్రభారతికి దీటుగా..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి దీటుగా నగరంలో జైపూర్ సిటీలోని రాజమహల్ తరహాలో నిర్మించిన కళాక్షేత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) స్వాధీనంలోని 4.25 ఎకరాల్లో నాలుగు అంతస్తుల్లో కళాక్షేత్రం నిర్మాణం పూర్తి చేసుకుంది. మొదటి అంతస్తులో ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, రిహార్సల్స్ రూం, గ్రీన్‌రూం, లాబీంగ్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలను వీక్షించేందుకు రెండు అంతస్తుల్లో 1,150 మంది కూర్చునేలా సీట్లు ఉన్నాయి. ప్రధాన వేదికకు ముందు మొదటి అంతస్తులో 22 వరుసలు, రెండో అంతస్తులో మరో 7 వరుసల కుర్చీల్లో కూర్చుంటే స్పష్టంగా కనిపించేలా తీర్చిదిద్దారు. 60 ఫీట్ల వెడల్పు, 40 ఫీట్ల పొడవుతో 2,400 చదరపు మీటర్ల భారీ స్టేజీ, డిజిటల్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. 2,990 చదరపు మీటర్ల వైశాల్యంలో సమావేశ మందిరాన్ని ఉడెన్ ఫ్లోరింగ్‌తో నిర్మించారు. అడ్వాన్స్ లైటింగ్, సెంట్రల్ ఏసీ కల్పించారు. అత్యాధునిక సౌండ్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో ఆర్ట్ గ్యాలరీ, ప్రీఫంక్షన్ ఏరియా, వంటగది, రెండో అంతస్తులో కాళోజీ వినియోగించిన వస్తువులతో ఆర్ట్ గ్యాలరీ ఉన్నాయి. ఆయన రచనలతో ప్రత్యేక గ్రంథాలయం రూపొందించారు.



కళాక్షేత్రంలో సీటింగ్ అరేంజ్‌మెంట్



ఏర్పాటు చేసిన భారీ వేదిక

సీఎం నేటి పర్యటన రద్దు

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటన వాయిదా పడినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి హనుమకొండలో నూతనంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ నాలాపై బ్రిడ్జిలను సీఎం సోమవారం ప్రారంభించేందుకు షెడ్యూల్ ఖరారైంది. అయితే.. హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ఆర్థిక బృందంతో సమావేశం ఉన్నందున జిల్లా పర్యటన రద్దు చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్టోబర్ 2వ తేదీన హనుమకొండకు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

రంగస్థలానికి అనుగుణంగా కళాక్షేత్రం..



రంగస్థల నాటకాలకు అనుగుణంగా కళాక్షేత్రం నిర్మించాలని పలుమార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేశాం. ఓరుగల్లులో నాటకరంగ కళాకారులకు సరైన వేదిక లేదని బాధపడేవాళ్లం. నటన, సంగీతం, నృత్యం, కళాదర్శకత్వం, సెట్టు ప్రాపర్టీస్, కాస్ట్యూమ్స్ డిజైన్లు అన్నీ కూడా ఒకే చోట, ఒకే వేదిక మీద ప్రదర్శించే విధంగా సమకూర్చుకోవాలన్నదే మా కోరిక. కళాక్షేత్రం పూర్తవడం సంతోషంగా ఉంది.

– ఆకుల సదానందం, తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు, హనుమకొండ

సామాన్య కళాకారుడికి కూడా అందుబాటులో ఉండాలి




ఓరుగల్లు ఎన్నో కళలు, సంస్కృతికి గొప్ప నిలయం. ఇక్కడి కవులు, కళాకారులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చరిత్ర ఉంది. వారి కళలు, సంస్కృతిని నలుదిశలా చాటి చెప్పేందుకు వేదిక తయారుకావడం ఆనందంగా ఉంది. కళాక్షేత్రం సామాన్య కళాకారుడికి కూడా అందుబాటులో ఉండాలి. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలతో వెలగాలి.

– బిల్ల మహేందర్, ప్రముఖ కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ

నిలకడగా భూగర్భ జలాలు

● హనుమకొండ జిల్లా సగటు భూగర్భ జలం 4.34 మీటర్లు



హన్మకొండ: హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. గత నెలలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలమట్టం పడిపోలేదు. జూలైతో పోలిస్తే ఆగస్టు మాసాంతానికి స్వల్పంగా పెరిగాయి. జూలై మాసాంతంలో 4.80 మీటర్ల లోతులో ఉన్నాయి. ఆగస్టు మాసాంతంలో సగటున 4.34 మీటర్ల లోతులో ఉన్నాయి. గత నెలతో చూసుకుంటే 0.46 మీటర్లు పెరిగింది. ఆగస్టు మాసాంతంలో అత్యధికంగా వేలేరు మండలం పీచరలో 21.50 మీటర్లు, ఐనవోలులో 15 మీటర్లు, చర్లపల్లి, ఎలుకుర్తిలో 9.10, భీమదేవరపల్లి వంగరలో 8.40, జగన్నాథపూర్‌లో 8.20 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టం ఉంది. కాగా, వేలేరులో 0.07 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలున్నాయి. ప్రతి నెల చివరి వారంలో భూగర్భ జలమట్టాలను భూగర్భ జలశాఖ నమోదు చేస్తుంది. హనుమకొండ జిల్లాలో ప్రత్యేకంగా బోరుబావులు తవ్వించి 25 ఫీజో మీటర్లు ఏర్పాటు చేశారు. ఈ ఫీజో మీటర్లు భూగర్భ జలమట్టాన్ని రికార్డు చేస్తాయి. వీటి నుంచి భూగర్భ జలశాఖ అధికారులు నీటిమట్టం రికార్డును సేకరిస్తారు. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో 2.65 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. జగన్నాథపూర్‌లో 8.20, కొత్తపల్లిలో 3.50, వంగరలో 8.40, ధర్మసాగర్ మండలంలో ధర్మాపూర్‌లో 2.80, ధర్మసాగర్‌లో 0.70, పెద్దపెండ్యాలలో 2.20, నారాయణగిరిలో 1.75, ఎల్కతుర్తిలో 9.10, హనుమకొండలో 4.10, హసన్‌పర్తి మండలం నాగారంలో 2.75, సీతంపేటలో 0.90, ఎల్లాపూర్‌లో 2.75, ఐనవోలు మండలం పున్నేలులో 4, పంథినిలో 2.95, ఐనవోలులో 15, కమలాపూర్ మండలం శనిగరంలో 0.70, వేలేరు మండలం పీచరలో 21.50, వేలేరులో 0.7, ఆత్మకూరులో 1.02, దామెరలో 0.80, నడికూడ మండలం చర్లపల్లిలో 9.10, నడికూడలో 0.50, పరకాలలో 1.20, శాయంపేట మండలం పత్తిపాకలో 1.15 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి.

● శిథిల భవనాల్లోనే నివాసం

చింతగట్టు క్యాంపులో శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లోనే జనం నివాసముంటున్నారు. అవి కూలిపోయి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగితే బాధ్యులెవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా 1980-81 సంవత్సరం ఉద్యోగుల కోసం అప్పటి ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో 290 క్వార్టర్స్ నిర్మించింది. వీటిలో ఉద్యోగులతో పాటు ఇతర వ్యక్తులు కూడా అద్దెకు ఉంటున్నారు. ఐదేళ్ల క్రితమే ఈభవనాల కాలపరిమితి ముగిసింది. ఖాళీ చేయాలని ఆశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోవడం లేదు. - హసన్‌పర్తి



శిథిలావస్థకు చేరిన భవనాలు

భారత్‌ను విశ్వగురువు చేయాలి

● ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ పారుపల్లి శంకర్
● ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

విద్యారణ్యపురి: జాతీయ విద్యావిధానంతోనే జాతి పునర్నిర్మాణం చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, న్యూఢిల్లీలోని ఎన్‌సీటీఈ సభ్యుడు, ఐసీఎస్ఎస్ఆర్ సభ్యుడు డాక్టర్ పారుపల్లి శంకర్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారక భవన్‌లో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యతోనే భారత్‌ను విశ్వగురువుగా చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాశ్చాత్య దేశాల విధానాలు విడనాడాలని, భారతీయ జీవన విధానంతోనే జాతీయ సమైక్యత సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా నుంచి 30 మంది, వరంగల్ జిల్లా నుంచి 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. విద్యార్థి ఉప్పుల సహస్రతేజ కూచిపూడి నృత్యం అలరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ బీజేపీ రాష్ట్ర కోకన్వీనర్ పులి సరోత్తమరెడ్డి, టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి బత్తిని వీరస్వామి, బత్తిని వెంకటరమణ, ఉప్పుల సతీశ్, డాక్టర్ మునికుంట్ల సంగెం శ్రీనివాస్, జిల్లాల క్వాలిటీ కోఆర్డినేటర్లు ఎ.శ్రీనివాస్, సుజన్‌తేజ, జిల్లా సైన్స్‌అధికారి కట్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీరావు, బాధ్యులు, ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మాకర్‌రెడ్డి ఎన్.శేఖర్ పాల్గొన్నారు.



ప్రశంస పత్రాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులతో టీపీయూఎస్ బాధ్యులు

90 శాతం పనులు మేమే చేశాం..

● కాంగ్రెస్ పార్టీ అంటేనే కమీషన్లు..
● మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

నయీంనగర్: కాళోజీ కళాక్షేత్రం 90 శాతం నిర్మాణ పనులు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు తామే పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం అద్దాలు, పుట్టీ, చెట్లు పెట్టి కళాక్షేత్రాన్ని మేమే నిర్మించామంటున్నారు.. ఎక్కడైనా ఇంత పెద్ద నిర్మాణం 9 నెలల్లో పూర్తవుతుందా అని ప్రశ్నించారు. 'మేము చేసింది చెప్పుకోలేకపోయాం.. వాళ్లు చేయంది కూడా చెప్పుకుంటున్నారు.. కాంగ్రెస్ పార్టీ అంటేనే కమీషన్లు' అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కాళోజీ కుటుంబాన్ని కలిసి రవీంద్రభారతిని తలదన్నేలా కళాక్షేత్రం నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కళాక్షేత్రం నిర్మాణం చేద్దాంటే అప్పటి కాంగ్రెస్ మంత్రులు స్పందించలేదని, ఆ తర్వాత నిర్మాణ సంస్థలు మారడం, కరోనా, ఎన్నికల కోడ్ వల్ల నిర్మాణం అలస్యమైన మాట వాస్తవమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, తన నియోజకవర్గం సరిహద్దులు కూడా తెలియదన్నారు. 300 గజాల స్థలం ఇవ్వమని చెప్పులు అరిగేలా తిరిగినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని, నీచ రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశం అనంతరం బీఆర్ఎస్ నాయకులు కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి.. వారి హయాంలో జరిగిన పనుల గురించి మీడియాతో మాట్లాడే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. బయటికి వెళ్లి మాట్లాడుకోవాలనడంతో.. మేమేమైనా ధర్నా చేస్తున్నామా.. అవసరమైతే కేసులు పెట్టుకోండి' అని వినయ్‌భాస్కర్ మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, సతీశ్‌బాబు, 'కుడా' మాజీ చైర్మన్ యాదవరెడ్డి, నాగుర్ల వెంకన్న, పులి రజనీకాంత్, నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రం వద్ద మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు

ఎమ్మెల్యేగా ఏం చేశావో చెప్పాలి

● చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలి
● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల అధికారంలో ఉండి ఎమ్మెల్యేగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన ఒక్కపని చెప్పుచూద్దాం.. చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కమీషన్ల కక్కుర్తితో నగరాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నగర అభివృద్ధికి నిధులు తీసుకొచ్చామన్నారు. నాడు హనుమకొండ వరదలతో ముంపునకు గురైతే మేమొచ్చిన అనతి కాలంలోనే నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మించి ప్రజలను కాపాడుకోగలిగామని, కేవలం కమీషన్ల కోసమే బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. కాళోజీ కళాక్షేత్రం మేము చేశామని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డబుల్ బెడ్రూం ఇళ్లు పేదలకు ఎందుకు పంపిణీ చేయలేదు.. కాజీపేట రైల్వే బ్రిడ్జి ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. కాళోజీ కళాక్షేత్రం వారే పూర్తి చేస్తే అధికారంలో ఉన్నప్పుడు మంత్రి హోదాలో నగరానికి వచ్చిన కేటీఆర్ ప్రారంభించకుండా ఎందుకు వెళ్లాడో చెప్పాలన్నారు. కళాక్షేత్రం నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఎన్ఐటీ మేధావులు చెబితే మరో రూ.పదికోట్లు అదనంగా వెచ్చించి పునర్నిర్మాణం చేశామన్నారు. నిర్మాణం అసంపూర్తిగా వదిలేస్తే కొందరు ఇనుపచువ్వలను కట్ చేసి అమ్ముకున్న వీడియోలు తమ వద్ద ఉన్నాయని, ఎముకల గూడులా మారిన కళాక్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి అదనంగా రూ.45 కోట్లు విడుదల చేసి ఆధునిక హంగులతో నాలుగు నెలల్లో పూర్తి చేశామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, స్టూవర్టుపురం ముఠా అక్రమాలను త్వరలోనే మీడియాకు అందిస్తానని, రాయడానికి ఎపిసోడ్‌లు సరిపోవన్నారు. ఎప్పుడూ స్థాయి గురించి మాట్లాడే ఆయన తన గోటికి కూడా సరిపోడని అన్నారు.



ఇనుపచువ్వలను కట్ చేసిన వీడియో చూపుతున్న ఎమ్మెల్యే నాయిని

నాటక సమాజ సమాఖ్యల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రాష్ట్ర నాటక సమాజ సమాఖ్యల హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గ ఎన్నికలు ఆదివారం వరంగల్ పోతన విజ్ఞానపీఠంలో జరిగాయి. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, ఉపాధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య, కార్యవర్గ సభ్యుడు గూడూరు బాలాజీ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. వరంగల్ నాటక సమాజ సమాఖ్య అధ్యక్షుడిగా మాడిశెట్టి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట లక్ష్మణ్, కోశాధికారిగా వనపర్తి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చిన్నబోయిన రాందాస్, జాయింట్ సెక్రటరీగా జూలూరు నాగరాజు, అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వోడపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా దేవరాజు రవీందర్‌రావు, కోశాధికారిగా సీత వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా బిటవరం శ్రీధరస్వామి, రాదారపు సంజీవరెడ్డి, దండు సారంగపాణి తదితరులు ఎన్నికయ్యారు.

ఆర్‌సీఓగా బాధ్యతలు స్వీకరించిన రాజ్‌కుమార్


రాజ్‌కుమార్

విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓగా కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఇటీవల ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ సెక్రటరీ సైదులు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన ఈనెల 7న హనుమకొండలోని కార్యాలయంలో ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివర కు ఆర్‌సీఓగా వ్యవహరించిన మనోహర్‌రెడ్డి ఇటీవల అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకుని ఖిలావరంగల్‌లోని బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- నాంచారిమడూరులో ఘటన


కాలు విరిగిన విష్ణు

తొర్రూరు రూరల్ : మండలంలోని నాంచారిమడూరు గ్రామ స్టేజీ సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన కొమ్ము విష్ణు, కట్ల ప్రణయ్, చిన్నవంగర గ్రామానికి చెందిన బొబ్బరకొండ సాయి.. గణనాథుడి పూజా సామగ్రి కోసం బైక్‌పై తొర్రూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాత్రులను తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి


లక్ష్మి మృతదేహం

వాజేడు: వాగులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పేరూరు పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కథనం ప్రకారం.. పేరూరు సమీపంలోని మర్రి మాగు వాగులో మృతదేహం ఉందనే విషయం తెలుసుకున్న ఎస్సై తన సిబ్బంది, జాలర్లతో కలిసి వాగు వద్దకు వెళ్లాడు. మృతదేహాన్ని బయటకు తీసి వెంకటాపురం(కె) మండలం ఎదిరకు చెందిన కంతి లక్ష్మి(60)గా గుర్తించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కంతి లక్ష్మి గుడిసె కూలిపోయింది. దీంతో ఐదు రోజుల క్రితం వాజేడు మండలం కృష్ణాపురంలో ఉంటున్న తన చెల్లెలు చెందురు బతుకమ్మ ఇంటికి వచ్చింది. అయితే లక్ష్మి వాగు వద్దకు ఎందుకు వచ్చింది అనే విషయం తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, మృతురాలు తన వెంట తెచ్చుకున్న గొడుగు ఘటనాస్థలిలో లభించడంతో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు తెలుస్తోంది.

మక్కలు @ రూ.3,015

మొక్కజొన్నకు రికార్డు ధర..

- వరంగల్ మార్కెట్‌లో అత్యధిక రేటు
- పెట్రోల్‌లో ఇథనాల్ వినియోగంతో పంటకు డిమాండ్
- తగ్గిన ఉత్పత్తి.. పెరిగిన ధర
- దిగుమతి చేసుకుంటున్న ప్రభుత్వం


మార్కెట్ యార్డులో మక్కల రాశులు

సంవత్సరం	వచ్చిన సరుకు	ధరలు (క్వింటాల్)
2020–21	30,169	1,898
2021–22	81,755	2,551
2022–23	80,813	2,450
2023–24	8965	2,936

(సెప్టెంబర్ 5వ తేదీ వరకు)

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మక్కలకు రెక్కలొస్తున్నాయి. మొక్క జొన్నలకు రికార్డు ధరలు నమోదు అవుతున్నాయి. క్వింటాల్‌కు రూ. 3,015 పలుకుతోంది. గతంలో మార్కెట్‌కు మక్కలు తీసుకువస్తే రోడ్లపై బారులుదీరి కనిపించేవి. దీంతో కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు, నిరసన చేపట్టిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడా పరిస్థితులు లేవు. జిల్లా వ్యాప్తంగా వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల మొక్కజొన్న పంట తగ్గిడంతో దిగుబడి మొత్తం పడిపోయింది. దీనికి తోడు పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం కూడా ఒక కారణమని చెప్పొచ్చు. వాహనాల్లో పెట్రోల్ వినియోగం వల్ల పెద్ద ఎత్తున్న కర్బన ఉద్గారాలు ఏర్పడి వాతావరణం కలుషితమవుతోంది. ఈ క్రమంలో పెట్రోల్‌లో ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం ఇంధన ఉత్పత్తి కంపెనీలను ఆదేశించింది. లీటర్ పెట్రోల్‌లో 10శాతం ఇథనాల్ కలపడం వల్ల తక్కువ పొగ వల్ల వెలువడుతుంది. తద్వారా వాతావరణం కలుషిత శాతం తగ్గుతుందని వాతావరణ నిపుణులు సూచించిన మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పెట్రోల్ ఉత్పత్తి కంపెనీలు కొన్నేళ్లుగా పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్నారు. ఈ ఇథనాల్‌ను మక్కల నుంచి తీస్తారని తెలిసింది. అందుకే మక్కలకు భారీ డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు తెలుపుతున్నాయి.

క్రమేపి పెరుగుతున్న ధరలు..

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పెట్రోల్ కంపెనీలు ఇథనాల తీసేందుకు పెద్ద ఎత్తున మక్కలు కొనుగోలు చేస్తున్నాయి. దీని వల్ల ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. మక్కలు ఏటా ఏప్రిల్, మే మాసంలో పెద్ద ఎత్తున మార్కెట్‌కు వస్తాయి. గడిచిన నాలుగేళ్ల నుంచి పరిశీలిస్తే ఏప్రిల్, మే నెలల్లో 2020–21లో 12,708క్వింటాళ్లు రాగా 2021–22లో 21,857క్వింటాళ్లు, 2022–23లో 42,703 క్వింటాళ్లు రాగా 2023–24లో సెప్టెంబర్ 5వ తేదీ నాటికి 2,392 క్వింటాళ్ల మక్కలు మాత్రమే మార్కెట్‌కు వచ్చినట్లు గణంకాలు చెబుతున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడి తగ్గడంతో ధరలు మాత్రమే పెరుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

దిగుమతి చేసుకుంటున్న కంపెనీలు..

దేశీయంగా డిమాండ్ మేరకు మక్కలు లభ్యం కాకపోవడంతో ఆయిల్ కంపెనీలు పెద్ద ఎత్తున్న ఇతర దేశాల నుంచి దిగుబడి చేసుకుంటున్నాయని వ్యాపార వర్గాలు తెలిపాయి. పెట్రోల్‌లో 10శాతం ఇథనాల్ కలపడం కేంద్రం తప్పని సరిచేయడంతో ఆయిల్ కంపెనీలు పెద్ద మొత్తంలో మక్కలు కొనుగోలు చేస్తున్నాయి. డిమాండ్ మేరకు విశాఖ పోర్టు ద్వారా మక్కలు విదేశాల నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి అవుతున్నట్లు తెలిసింది.

మార్కెట్‌లో రికార్డు ధర



వరంగల్ వ్యవసాయ మార్కెట్ చరిత్రలో మక్కలు క్వింటాల్‌కు రూ.3015 పలకడం రికార్డు. ఆ ధర నాకు లభించడం సంతోషంగా ఉంది. సీజన్ ఇంకా పూర్తి కానందున సరుకు తక్కువ ఉండడ వల్ల ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

-సురావు కిషన్‌రావు, నడికూడ

దిగుబడి తగ్గింది



అకాల వర్షాలకు మొక్క జొన్న పంట దెబ్బతింది. అందుకే దిగుమతి తగ్గింది. పాత మక్కలకు ధరలు ఎక్కువ పలుకుతోంది. కొత్త వాటికి గతం కంటే ఎక్కువ ధర లభించడం సంతోషంగా ఉంది.

-వెంకటేశ్వర్లు, రైతు

ఆనందంగా ఉంది



దిగుబడి తగ్గినా ధరలు ఎక్కువ పలకడం ఆనందంగా ఉంది. ధరలు ఇలా ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు ముందుగా చెబితే ఎక్కువ మంది రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు.

-నారాయణ, రైతు, దుగ్గొండి

కూతురు వద్దకు వెళ్తూ అనంతలోకాలకు..

- బొలెరో ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం
- బొల్లికుంట వాగ్దేవి కళాశాల వద్ద ఘటన

మామునూరు : హాస్టల్‌లో ఉన్న బిడ్డను చూసేందుకు బయలుదేరిన తండ్రి అనంతలోకాలకు చేరాడు. బొలెరో ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం ఖమ్మం జాతీయ రహదారిపై బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఎదుట జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఎస్.కె సర్వర్ పదేళ్ల క్రితం భార్యాపిల్లలతో కలిసి పున్నేలు గ్రామానికి వలస వచ్చాడు. పున్నేల్ క్రాస్ వద్ద ఓ చికెన్‌సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వాగ్దేవి కళాశాల సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ ఉండి చదువుకుంటున్న కుమార్తెను చూసేందుకు పున్నేలు క్రాస్ నుంచి నడుచుకుంటూ హాస్టల్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో వాగ్దేవి కళాశాల ఎదుట రాగానే ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న బొలెరో ఎస్.కె. సర్వర్(50)ను ఢీకొని వెళ్లింది. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన కూతురు ఘటనాస్థలికి చేరుకుని గుండెలవిసేలా రోదించింది. నన్ను చూసేందుకు రాకపోతే నీవు బతికేవాడివి నాన్నా అంటూ తండ్రి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురికి కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.


సర్వర్(ఫైల్)

పిడుగు పాటుకు మహిళ మృతి


సులోచన (ఫైల్)

భూపాలపల్లి రూరల్: పిడుగు పాటుకు ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన శనివారం భూపాలపల్లి మండలం శ్యాంనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. గణపురం మండలంలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన పొనగంటి సులోచన (44) భూపాలపల్లి మండలంలోని శ్యాంనగర్‌కు మిర్చి నారు నాటడానికి కూలీ పనికి వచ్చింది. శనివారం మధ్యాహ్నం భారీ వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ఓ పిడుగు సులోచన సమీపంలో పడింది. దీంతో స్పృహ తప్పడంతో సహ కూలీలు ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది. మృతురాలికి భర్త భాస్కర్ రావు తోపాటు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాపం.. పసివాడు

- 21 రోజుల వ్యవధిలో తల్లికొడుకు మృతి
- ఇద్దరికి తలకొరివి పెట్టిన దివ్యాంగ బాలుడు
- నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు


నానమ్మకు తల కొరివి పెడుతున్న మనవడు తరుణ్

కురవి : పాపం.. పసివాడు. ఎంత కష్టం వచ్చింది. రాఖీ పౌర్ణమి రోజున తండ్రి మృతి చెందాడు.. తర్వాత 21వ రోజున తండ్రి తల్లి (నానమ్మ) మృతి చెందింది.. ఒకే ఇంట్లో 21 రోజుల వ్యవధిలో తల్లికొడుకు మృతి చెందడంతో ఆ ఇద్దరికి ఏడేండ్ల దివ్యాంగ బాలుడు తలకొరివి పెట్టాడు. ఈ విషాదకర ఘటన కురవి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. కురవికి చెందిన గుడిమల్ల భద్రయ్య గత నెల రాఖీ పౌర్ణమి రోజున అనారోగ్యంతో మృతి చెందాడు. కొడుకు చనిపోయిన 21వ రోజున ఆదివారం భద్రయ్య తల్లి మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. భద్రయ్యకు కొడుకు తరుణ్ తలకొరివి పెట్టాడు. భద్రయ్య తల్లి మల్లమ్మకు కూడా మనవడు తరుణ్ తలకొరివి పెట్టాడు. తరుణ్‌కు చెవులు వినబడవు, మాటలు రావు (మూగ చెవిటి దివ్యాంగుడు). ఈ క్రమంలో ఇంటికి పెద్ద దిక్కైన ఇద్దరూ మృతి చెందడంతో బాలుడికి తల్లి నాగలక్ష్మి ఒక్కరే మిగిలింది. ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. పోషించాల్సిన నాన్న, ఇంట్లో పెద్ద దిక్కుగా ఉంటుందనుకున్న నాన్నమ్మ మృతి చెందడంతో పసివాడి ప్రాణం తల్లడిల్లింది. ఈ ఘటనపై దాతలు, ప్రభుత్వం స్పందించి నాగలక్ష్మి, దివ్యాంగ బాలుడిని ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్


దామెర పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న డీసీపీ రవీందర్

దామెర: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేష న్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి మాట్లాడారు. గ్రా మాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషిచేయాలని, నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్ర మాదాల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని పే ర్కొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు శాంతి యుత వాతావరణంలో నిర్వహించాలని, గుట్కా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, నేరాల నియంత్రణకు కృషిచేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలను పరిరక్షించాలి

- సీసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్


సుదర్శన్‌కు చెరువులు, కుంటల వివరాలతో కూడిన పత్రాలు అందజేస్తున్న ఏకో లీగల్ సెల్ చైర్మన్ యశ్వంత్

ఖిలా వరంగల్ : అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలను స్వాధీనం చేసుకుని పరిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని సీసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో ఏకో లీగల్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ మురారిశెట్టి యశ్వంత్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య న్యాయ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గొలుసుకట్టు చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చెరువుల పరిరక్షణ కమిటీ, ధరణి లాంటి పోర్టల్ అధికారికంగా ఏర్పాటు చేసిన వాటి మాటుననే ఆక్రమణ లు పెద్ద ఎత్తున జరిగాయని ఆరోపించారు. హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌లో కూడా ఆక్రమణాలపై హైడ్రా పనిచేయాలన్నారు. త్రినగరిలో భద్రకాళీ చెరువుతోపాటు మొత్తం 72 చెరువులు, కుంటలు ఉన్నాయన్నారు. భద్రకాళీ సుందరీకరణ పేరుతో విధ్వంసం, దోపిడీ జరిగిందన్నారు. చెరువు భూములపై పత్రాలు సృష్టించి ప్లాట్లు మార్చేసి విక్రయించారని ఆరోపించారు. దీనిపై ఏకో లీగల్ సెల్ అందజేసిన సమగ్ర వివరాలు ప్రభుత్వం, న్యాయస్థానానికి అందజేయనున్నామని పేర్కొన్నారు. సమావేశంలో న్యాయవాదులు ఆర్.ఆనందరావు, ఆర్. భిక్షపతి, బి. అనిల్‌కుమార్, సమాఖ్య ప్రతినిధులు కార్తీక్, జె. వీరస్వామి, ప్రభాకర్, రమేశ్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


వీసీలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఎస్ఈలు, డీఈలను ఆదేశించారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, మహబూబాబాద్ సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్‌లు, డివిజనల్ ఇంజనీర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదలతో జరిగిన నష్టాన్ని, దెబ్బతిన్న లైన్ల వివరాలు, లైన్ల పునరుద్ధరణ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ మహబూబాబాద్ సర్కిల్‌లో భారీ వర్షాలతో దెబ్బతిన్న డోర్నకల్, గార్ల, కొత్తపేట, సీరోల్, మరిపెడ, చిన్న గూడూరు సెక్షన్ల పరిధిలో పునరుద్ధరణ పనులు వేగంగా చేయాలని, అవసరమైన అదనంగా సిబ్బందిని, అదనపు కాంట్రాక్టర్లను నియమించుకోవాలని ఆదేశించారు. యాజమాన్యం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, ఇతర విభాగాల్లో పనిచేసే ఏడీఈ, ఏఈలను ఫీల్డ్‌లో వినియోగించుకోవాలని సూచించారు. తరచూ నష్టం జరిగే లైన్లలో కొత్త రూట్ల(రీ రూటింగ్ చేపట్టాలని)లో విద్యుత్ లైన్ వేయాలని పేర్కొన్నారు. వాగుల నుంచి 500 మీటర్ల దూరంలో 9.1 మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. గుండ్రాతి మడుగు, మరిపెడ–1, 2, చిన్నగూడూరు ఫీడర్ల వద్ద పురోగతిలో ఉన్న 33 కేవీ లైన్ పనులను పర్యవేక్షించాలని కన్‌స్ట్రక్షన్ సీఈ, ఎమ్మార్టీ డీఈలకు సూచించారు. ఇంకా 1,800 స్తంభాలు మార్చాల్సి ఉందని, 41 ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు నిర్మాణం పూర్తికాగా, నీట మునిగిన 179 వాటిని పునరుద్ధరించాలన్నారు. ఖమ్మం సర్కిల్‌లో 3,780 స్తంభాలు మార్చాల్సి ఉందని, 270 ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు పూర్తిగా నీటిలో మునిగినవి 290 నిర్మించాల్సి ఉందని చెప్పారు. దెబ్బతిన్న కూసుమంచి, పాలేరు, ముదిగొండ, పమ్మి, ఆరెంపుల, పల్లెగూడెం, నాగుల వంచ, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ప్రకాష్‌నగర్‌లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వీసీలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, సీజీఎంలు కిషన్, అశోక్, బీకం సింగ్, జీఎంలు నాగప్రసాద్, అన్నపూర్ణ, ఎస్ఈ అంకుష్ పాల్గొన్నారు.

అన్నారం బరాజ్ గేట్ల కింద ఇసుక నిల్వలు

- 5మీటర్ల ఎత్తులో ఇసుక మేటలు
- 18 వెంట్లలో నిండిన ఇసుక
- గేట్లు కిందికి దించలేని పరిస్థితి!


అన్నారం బరాజ్ వద్ద ఇసుక మేటలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం బరాజ్ గేట్ల కింద భారీగా ఇసుక నిల్వలు పేరుకుపోయాయి. వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఈ దృశ్యం కనిపించింది. వారం రోజులుగా ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లిలో బరాజ్ గేట్లు ఎత్తడంతో దిగువకు వరద తరలి వచ్చింది. దీంతోపాటు అన్నారం బరాజ్‌కు స్థానికంగా పెద్దవాగు వరద, ఇంకా చిన్న చిన్న వాగుల గుండా వచ్చే నీటి ప్రవాహంతో ఇసుక నిల్వలు బరాజ్ 18 వెంట్లలో పేరుకున్నాయి. వారంపాటు 5–8లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో కాళేశ్వరం వైపునకు తరలింది.

ఎన్‌డీఎస్ఏ సూచనలతో గేట్లుఎత్తిన ఇంజనీర్లు..

గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌కు 20వ పియర్ కుంగిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారం రోజులకు అన్నారం బరాజ్‌లో సీపేజీ లీకేజీలు ఏర్పడ్డ విషయం కూడా విధితమే. దీంతో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు అన్నారం బరాజ్‌లోని 66 గేట్లు, మేడిగడ్డ బరాజ్‌లో 85గేట్లు పూర్తిగా ఎత్తారు. గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వస్తున్న వరదను నిల్వ చేయకుండా దిగువకు తరలిస్తున్నారు. అప్పటి నుంచి బరాజ్‌ల్లో గ్రౌటింగ్, ఇతర జియో ఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు, సాంకేతికంగా మరమ్మతులు చేస్తున్నారు. వర్షాకాలం రావడం.. వరదలు ప్రారంభమవడంతో తాత్కాలికంగా మరమ్మతులు నిలిచాయి.

నీటినిల్వ చేసేది కష్టమే..

ప్రస్తుతం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో అన్నారం వద్ద 18 వెంట్‌ల మధ్య గేట్ల కింది భాగంలో, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌ల్లో 4–5 మీటర్ల ఎత్తులో ఇసుక నిండిపోయింది. గేట్లు దించడానికి కూడా అవకాశం లేకుండా పోయినట్లు తెలిసింది. వర్షాలు తగ్గి ప్రభుత్వం గేట్లు దించాలని ఆదేశాలు ఇచ్చినా గేట్లు దించలేని పరిస్థితులు ఉన్నట్లు తెలిసింది. గేట్లన్ని ఎత్తి ఉంచితే నీటిని నిల్వ చేయడం కష్టం.

జూన్‌లో ఇసుక తొలగింపు..

ఈఏడాది జూన్‌లో సుమారు 6లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. అందులోంచి టీజీఎండీసీ ద్వారా 2లక్షలకు పైగా క్యూబిక్ మీటర్ల వరకు తొలగించారు. ప్రస్తుతం అంతకు రెట్టింపు ఇసుకమేటలు గేట్ల వద్ద ఉన్నట్లు సమాచారం. ఇసుకతో గేట్లకు ప్రమాదం పొంచి ఉందని తెలిసింది. త్వరగా ఇసుక తొలగింపు చేయడానికి వర్షాలు పడుతుండడంతో టిప్పర్లు, లారీలు, ఇతర మిషన్‌లు గోదావరిలోకి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు సైతం ఏమి చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. ఈవిషయమై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా స్పందించడం లేదు.

గ్రామీణులకు వైద్యం అందేలా కృషి చేయాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఐఎంఏ జోన్–3 రాష్ట్ర స్థాయి సదస్సు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఎంపీ, అతిథులు

ఎంజీఎం : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు వైద్యులు ముందుకు వచ్చేలా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీ కడియం కావ్య కోరారు. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన ఐఎంఏ జోన్–3 రాష్ట్ర స్థాయి సదస్సును ఆమె ప్రత్యేక అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. పల్లె ప్రాంతాల్లో ప్రభుత్వం వైద్యసేవలు అందిస్తే ప్రత్యేక బోనస్ వేతనాలు అందిస్తామని ప్రకటించిందని ఎంపీ పేర్కొన్నారు. పల్లె ప్రాంతాల్లో అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్‌తోపాటు సీజనల్ వ్యాధులకు ఆ ప్రాంతంలోనే వైద్యసేలందించడం వల్ల ఆ రోగాలు వ్యాప్తి తగ్గడంతో పాటు ప్రాణాంతక పరిస్థితుల నుంచి కాపాడొచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్యరంగానికి కేటాయిస్తున్న రెండు శాతం బడ్జెట్‌ను పెంచేలా లోక్ సభలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఐఎంఏ నూతన జాతీయ అధ్యక్షుడు దిలీప్ బాన్సలీ మాట్లాడుతూ వైద్యులకు ఎనిమిది గంటల పనిసమయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల్లో రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని కోరారు. వైద్యుల సమస్యల కోసం ఐఎంఏ ఐక్యమత్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో జై జవాన్– జై కిసాన్ అనే నినాదం ఎంత ప్రాముఖ్యం కలదో.. కరోనా తరువాత జై డాక్టర్ అనే నినాదం కూడా అంతే ప్రాముఖ్యతను సాధించుకుందని తెలిపారు. కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దుర్ఘటనను యావత్ భారతదేశం ముక్తకంఠంతో ఖండించడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు విజయ్‌చందర్‌రెడ్డి, సాంబశివరావు, శేషుమాధవ్, నరేశ్, సుదీప్, అన్వర్‌మీయా, నాగార్జునారెడ్డి, సంధ్యరాణి, అశోక్‌రెడ్డి, ప్రవీణ్, బందెల మోహన్ రావు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై టీజీ ఎన్పీడీసీఎల్ సీరియస్

- సేవలకు ప్రతిఫలంగా లంచం ఆశిస్తే కఠిన చర్యలు

హన్మకొండ: అవినీతిపై టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సీరియస్‌గా ఉంది. కరప్షన్‌కు పాలడుతున్న అధికారులు, సిబ్బందిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అవినీతికి పాల్పడొద్దంటూ హెచ్చరికలు జారీ చేసింది. విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఎవరైనా లంచం అడిగితే ఇవ్వొద్దంటూ ప్రతి విద్యుత్ కార్యాలయంలో పోస్టర్లు ప్రదర్శించింది. అయినా ఇవేమి తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. ×లంచం ఇవ్వకండి... మాకు సమాచారం ఇవ్వండి¤ అనే పోస్టర్‌ను సెక్షన్ (ఏఈ) కార్యాలయం నుంచి.. ప్రధాన కార్యాలయం వరకు.. అన్ని విభాగాలు, అన్ని స్థాయిల విద్యుత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. అయినా ఈ పోస్టర్ వేసిన నెల రోజుల్లోనే జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజనల్ ఇంజనీర్ హుస్సేన్ రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ పట్టుబడ్డాడు. ఈ క్రమంలో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మరోసారి హెచ్చరిస్తూ ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని, సేవలు అందించే క్రమంలో అధికారులు, సిబ్బంది వినియోగదారులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. సేవలకు ప్రతిఫలంగా లంచం అడిగితే విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్న ఫోన్ నంబర్ 9281033233, అలాగే, అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. అధికారులు, సిబ్బంది సిటిజన్ చార్టుకు లోబడి సేవలు అందించాలని స్పష్టంగా పేర్కొంది. ఉల్లంఘించి అవినీతికి పాలడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. గ్రీవెన్స్ పోర్టల్ వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు చేసుకోవచ్చు.

ఉద్యోగం పేరుతో మోసం..

- వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఉద్యోగం, డబుల్‌బెడ్రూం ఇల్లు ఇప్పిస్తానని రూ. 5లక్షల కాజేసి మొఖం చాటేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన మొడం ప్రవీణ్ అదే ప్రాంతానికి చెందిన సముద్రాల రాంబాబుకు మహానగరపాలక సంస్థలో జావాన్ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.5లక్షలు నగదు తీసుకున్నాడు. ఉద్యోగం కానీ డబుల్ బెడ్రూం ఇల్లు కానీ ఇప్పించలేదు. ఏడాది దాటినా ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించకపోవడంతో బాధితుడు సముద్రాల రాంబాబు ఆదివారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో మొడం ప్రవీణ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.